క్లుప్తంగా

రేపు గడప గడపకు మన ప్రభుత్వం


వలంటీర్లతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: మండల కేంద్రంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గౌరి తెలిపారు. పూతలపట్టు సచివాలయంలో శనివారం వలంటీర్లతో ఎంపీడీవో సమావేశమయ్యారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పురవీధుల్లో చెత్త,చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఉదయం 7 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమానికి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, మండల అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

సంస్థాగతంగా బలపరచాలి

చిత్తూరు కార్పొరేషన్: భారతీయ జనతా పార్టీని సంస్థాగతంగా బలపరచాలని ఆ పార్టీ కర్ణాటక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిర్మలమ్మ తెలిపారు. పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మహిళ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై ప్రచారం చేయాలన్నారు. ప్రతి మహిళ తమ వంతుగా ఇంటింటికీ వెళ్లి బీజేపీ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నీతిచౌదరి, చిట్టిబాబు పాల్గొన్నారు.

8271 మందికి పీఎం కిసాన్ నిధులు

తవణంపల్లె: ప్రధాన మంత్రి కిసాన్ పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేసినట్లు వ్యవసాయాధికారి జి.ప్రవీణ్ తెలిపారు. మండలంలోని 8271 మంది రైతుల ఖాతాల్లోకి 14వ విడత కింద ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున జమ చేసినట్లు వివరించారు. ఈకేవైసీ చేసుకోని రైతులకు ఈ పథకం కింద నిధులు జమ కావని తెలిపారు. ఈకేవైసీ చేసుకోని రైతులు స్పందించి వెంటనే ఈకేవైసీ చేసుకోవాలని కోరారు.

వాహనాల తనిఖీ

చిత్తూరు అర్బన్: నగరంలో శనివారం వాహనాల తనిఖీలు ముమ్మరంగా చేపట్టారు. వాహనాల దొంగతనాల నేపథ్యంలో ఈ తనిఖీలు ప్రారంభించారు. 40 మందికి జరిమానా విధించారు. సరైన ధ్రువీకరణ ప్రతాలు లేకుండా దొంగిలించిన వాహనాలను నడుపుతున్న వ్యక్తులపై నిఘా ఉంచినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

సురక్షలో ప్రథమ స్థానం

సదుం: జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహణలో సదుం మండలం జిల్లాలో ప్రథమ స్థానం సాధించినట్టు జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి శనివారం తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, అధికారుల సహకారంతో ఈఘనత సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు.

ఆలయ భూములు కౌలుకు వేలం రేపు

పలమనేరు: కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూములు కౌలుకు ఈనెల 31న ఉదయం 9 గంటలకు స్థానిక ఆలయం వద్ద బహిరంగవేలాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కమలాకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో గంగవరంలోని సర్వేనం: 422/8లో 39 సెంట్లు, 451/4లో 82 సెంట్లు, 457లో 2.40 మొత్తం 3.61 ఎకరాల భూమిని మూడేళ్లు కౌలుకు ఇవ్వనున్నట్లు అందులో తెలిపారు. ఇందులో పాల్గొనేవారు రూ.10వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు.

నిర్వాణ నారాయణస్వామికి ద్వాదశి పూజలు

పలమనేరు: మన్నారునాయునిపల్లిలో వెలసిన నిర్వాణ నారాయణస్వామికి ద్వాదశి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు, పంచామృత అభిషేకాన్ని భక్తులు నిర్వహించారు. పరిమళ ద్రవ్యాలతో విగ్రహాన్ని అభిషేకించి ఆపై అలంకరణలు చేసి మంగళహారతులతో స్వామివారిని దర్శించుకున్నారు.

సూర్యుని చుట్టూ వలయం

కుప్పం: ఆకాశంలో సూర్యుని చుట్టూ వలయాకారం కుప్పంలో శనివారం కనిపించింది. శనివారం శ్రావణ అధిక మాసం ఏకాదశి పర్వదినం రోజున మధ్యాహ్నం సూర్యుని చుట్టూ వలయాకారంలో కన్పించింది. పట్టణ సమీపంలోని ప్రసన్న తిమ్మరాయస్వామి దేవాలయంలో శనివారం పురష్కరించుకుని అభిషేకం పూజలు నిర్వహిస్తున్న సమయంలో ఇలాంటి దృశ్యం ఆకాశంలో కన్పించడం దైవ సంకల్పంగా భావించి పూజలు చేశారు. ఆకాశంలో సూర్యుని చుట్టూ వలయాన్ని ప్రజలు ఆశక్తిగా తిలకించారు.



పల్లె వాకిట్లో సర్కారు వైద్యం

- గ్రామాల్లో వెలసిన విలేజ్ క్లినిక్‌లు
- ఫ్యామిలీ డాక్టర్‌తో ఇంటి వద్దే వైద్య పరీక్షలు
- పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేసిన ప్రభుత్వం



బంగారుపాళెం: గతంలో మెరుగైన వైద్య సేవల కోసం గ్రామీణ ప్రజలు పట్టణాలకు వెళ్లేవారు. ఆర్థిక స్తోమత లేని వారు దీర్ఘ వ్యాధుల బారిన పడి చికిత్స చేయించుకోలేక మంచం పట్టేవారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక 'వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్'లను తీసుకువచ్చారు. వీటి ద్వారా కొన్నేళ్లుగా వైద్యం అందని గ్రామాలు, 108, 104 వాహనాలు వెళ్లని గ్రామాల్లో కూడా నేడు చికిత్స పొందుతున్నారు. అంతే కాకుండా ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ఆస్పత్రికి వెళ్లలేని రోగుల వద్దకు డాక్టర్లే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు.

2500 మందికి ఒక విలేజ్ క్లినిక్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి 2500 జనాభాకు ఒక విలేజ్ హెల్త్ క్లినిక్ చొప్పున ఏర్పాటు చేసి నూతన భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటారు. హెల్త్ సెంటర్‌లో 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. 68 రకాల మందులను అందుబాటులో ఉంచారు. హెల్త్‌సెంటర్‌లో ఎక ఎంఎల్‌హెచ్‌పీతో పాటు ఏఎన్ఎం, గ్రామాల్లోను ఆశా వర్కర్లు అనుసంధానం చేశారు.

మండలంలో 27 క్లినిక్‌లు

మండలంలో 41 గ్రామ పంచాయతీలు, 180 గ్రామాల్లో 75 వేల మంది జనాభా ఉన్నారు. 27 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పని చేస్తున్నాయి. అవసరమైతే రోగి ఇంటి వద్దకే వెళ్లి సేవలు అందిస్తున్నారు. ప్రతి రోజూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు.

మండలంలో ప్రాథమిక వైద్య సదుపాయాలు

- గర్భిణులకు, చిన్నారుల సంరక్షణకు అవసరమైన వైద్యసేవలు
- నవజాత శిశు ఆరోగ్య సంరక్షణ సేవలు
- బాల్యం, కౌమార దశ ఆరోగ్య సంరక్షణ సేవలు
- కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక సేవలు, ఇతర పునరుత్పత్తి సేవలు
- అంటువ్యాధుల నిర్వాహణ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు
- సాధారణ అనారోగ్యాలు, చిన్న జబ్బులకు జనరల్ అవుట్ పేషెంట్ కేర్
- అసాంక్రమిక వ్యాధులు, స్క్రీనింగ్, నివారణ, నియంత్రణ
- సాధారణ ఆప్తాల్మిక్(కంటి సమస్యలు), ఈఎన్‌టీ సమస్యల కోసం జాగ్రత్తలు
- ప్రాథమిక నోటి ఆరోగ్య సంరక్షణ



విలేజ్ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది, ఇంటి వద్ద రోగికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

- వృద్ధాప్య వ్యాధులకు చికిత్స, ఉపశమన ఆరోగ్య సంరక్షణ సేవలు
- కాలిన గాయాలకు, ప్రమాదాల్లో గాయపడిన(ట్రామా)వారికి అత్యవసర వైద్య సేవలు

ప్రాథమిక పరీక్షలు ఇవి

- హిమోగ్లోబియా, గర్భిణులకు యూరిన్ పరీక్ష, ఇతర యూరిక్ టెస్టులు, బ్లడ్ షుగర్, మలేరియా, హెచ్‌ఐవీ, డెంగీ, కంటి పరీక్షలు, అయోడిన్ సాల్ట్ పరీక్షలు, వాటర్ టెస్టింగ్, హెపటైటిస్ బి, ఫైలేరియా, ర్యాపిడ్ టెస్ట్, కఫం పరీక్షలు.

సమయానికి టీకాలు



నా బిడ్డకు సమయానికి టీకాలు వేస్తున్నారు. ఎప్పటికప్పుడు నాకు జాగ్రత్తలు చెబుతున్నారు. బాలింతగా ఉన్నప్పుడు ఎలాంటి ఆహారం తీసుకోవాలో చెబుతున్నారు. మందులన్నీ ఉచితంగా అందిస్తున్నారు. అవసరమైతే ఇంటివద్దకే వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత మాలాంటి వారికి వైద్య సేవలు చక్కగా అందుతున్నాయి.

– శిల్ప, తిమ్మోజుపల్లె, బంగారుపాళెం

నాణ్యమైన వైద్య సేవలు



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా తనతోపాటు మరో వైద్యుడు పీహెచ్‌సీ పరిధిలో కేటాయించిన గ్రామాలకు వెళ్లి ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ విధానంతో మారుమూలన ఉన్న గ్రామీణులకు నాణ్యమైన వైద్య సేవలు ఉచితంగా, ఇంటి వద్దనే అందుతున్నాయి.

–లోకేష్, ఫ్యామిలీ ఫిజీషియన్, తుంబకుప్పం

ఇంటి వద్దే పరీక్షలు



బీపీ, షుగర్ పరీక్షల కోసం పట్టణాలకు వెళ్లి పరీక్షలు చేసుకోవాల్సి వచ్చేది. డబ్బులు కూడా ఖర్చు పెట్టుకుని వెళ్లాల్సి వచ్చేది. గ్రామాల్లో హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసిన తరువాత దూరప్రాంతాలకు వెళ్లే బాధలు తప్పాయి. సిబ్బంది ఇంటి వద్దే పరీక్షలు చేస్తున్నారు. ఉన్న ఊర్లోనే వైద్యం అందుతోంది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం పేదలకు వరంలా మారింది.

–సరోజమ్మ, తిమ్మోజుపల్లె

చిన్నారులు, గర్భిణులకు వైద్యం



గ్రామాల్లో ఉన్న చిన్నారులుతో పాటుగా గర్భిణులకూ వైద్య సేవలు అందిస్తున్నాం. పిల్లలను గుర్తించి వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నాం. వ్యక్తిగత పరిశుభ్రతపై, గర్భిణుల్లో రక్తహీనత, షోషకాహార లోపంపై అవగాహన కల్పిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడం ఎంతో ఆనందంగా ఉంది. ప్రభుత్వం వైద్యానికి ప్రాధాన్యత ఇస్తోంది.

–డాక్టర్ రమేష్, తుంబకుప్పం పీహెచ్‌సీ

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని రాములు గుడివీధిలోని జైన్ సంఘ ప్రార్థన మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆ నిర్వాహకులు సుభాష్‌జైన్ తెలిపారు. ఉదయం 7 నుంచి 10 గంటల వరకు ఎస్వీ అరవింద్ ఆస్పత్రి సహకారంతో నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

అట్టహాసంగా పీర్ల ఊరేగింపు

చిత్తూరు రూరల్: మొహర్రం పండుగను పురస్కరించుకుని నగరంలో శనివారం పీర్లను అట్టహాసంగా ఊరేగించారు. పండుగ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో పీర్లను కొలువుదీర్చారు. మత పెద్దలు ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం రాత్రి అగ్గి తొక్కే కార్యక్రమాన్ని చేపట్టారు. తరువాత రోజు పీర్లను ఊరేగించడం ఆనవాయితీ. ఈ మేరకు సాయంత్రం డప్పువాయిద్యాల నడుమ పీర్లను ఘనంగా ఊరేగించారు. యువత, పెద్దలు, చిన్నారులు డప్పుకు దరువు వేస్తూ రోజంగా ఉత్సాహంగా కనిపించారు.

వన్‌టౌన్ ఎస్ఐగా భారతి


బాధ్యతలు స్వీకరించిన భారతి

చిత్తూరు అర్బన్: చిత్తూరు వన్‌టౌన్ ఎస్ఐగా భారతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె విజయపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తూ, బదిలీపై వన్‌టౌన్‌కు వచ్చారు. ఆమె మాట్లాడుతూ వన్‌టౌన్ పరిధిలో వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తామన్నారు. లా అండ్ ఆర్డర్ పరిక్షణకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

7 వేల మందికి పీఎం కిసాన్ సాయం

ఐరాల: మండలంలో 7 వేల మంది రైతులకు 14వ విడత పీఎం కిసాన్ సాయం మంజూరైనట్లు శనివారం ఏఓ వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం రైతులకు ముందస్తు సాయం అందించే ప్రక్రియలో భాగంగా పీఎం కిసాన్ పథకం అమలు చేస్తోందన్నారు. అర్హులైన రైతులకు సాయం అందకపోతే బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలని సూచించారు.

ఐక్యతకు ప్రతీక మొహర్రం


చావిడిలో పీర్లను దర్శించుకుంటున్న భక్తులు


అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు

బంగారుపాళెం: హిందూ, ముస్లింల ఐక్యతకు ప్రతీకగా నిలిచే మొహర్రం భక్తి శ్రద్ధలతో శనివారం ఘనంగా నిర్వహించారు. గత వారం రోజులుగా స్థానిక రాజావీధిలో ఏర్పాటు చేసిన చావిడిలో పీర్లకు ముస్లింలు, హిందువులు ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. మొహర్రం వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి అగ్నిగుండంలో నిప్పులపై నడిచి మొక్కులు చెల్లించుకున్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ, ఇస్లాం ధర్మాన్ని రక్షించేందుకు మహ్మద్‌ప్రవక్త మనుమలు ఇమామ్ హసేన్, ఇమామ్ హుస్సేన్ తదితర వీరుల సంస్మరణార్థం మొహర్రం పండుగను సంతాప దినాలుగా పాటిస్తారని తెలిపారు. రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్‌రాజా, సీఐ నాగరాజరావు పీర్లను దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం

తవణంపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో మొహర్రం నిర్వహించారు. శనివారం సాయంత్రం మత్యం క్రాస్‌లో ముస్లింలు పీర్లు చేతపట్టి అగ్నిగుండ ప్రవేశం చేశారు. వీరుల త్యాగానికి ప్రతీకగా మొహర్రం పండుగను పల్లెల్లో హిందూ, ముస్లింలు కలసి వైభవంగా నిర్వహించారు. మండలంలోని అరగొండ, మత్యం క్రాస్, పొన్నేడుపల్లె, గాజులపల్లె, జెట్టిపల్లె, ఎగువ తవణంపల్లె, మత్యం తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు నిర్వహించారు.

అక్కమ్మ దేవాలయ కుంభాభిషేకం


భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

గుడిపాల: మండలంలోని రామభద్రాపురం గ్రామంలో శనివారం ఘనంగా అక్కమ్మ దేవత ఆలయంలో కుంబాభిషేకం నిర్వహించారు. రెండురోజులుగా వేదపండితుల మధ్య ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కలశ, విగ్రహప్రతిష్ట నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పొంగళ్లు పెట్టి మధ్యాహ్నం అన్నదానం చేశారు. అనంతరం అమ్మవారి గెరిగెను ఊరేగించారు. ఎంపీటీసీ గోళ్ల హరిప్రసాద్, మాజీ సర్పంచ్ అమరేంద్ర బాబు, మండల సచివాలయ కన్వీనర్ సాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.


గరిగను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న దృశ్యం

27న అంగన్‌వాడీ సదస్సు


మాట్లాడుతున్న అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత

చిత్తూరు కార్పొరేషన్: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 27న విజయవాడలో సదస్సు నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. చిత్తూరులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత మాట్లాడారు. ఆగస్టు మొదటి వారంలో గర్భిణులు, బాలింతలకు ఇంటింటికీ బియ్యం ఇవ్వాలని ఆదేశాలు వచ్చాయని చెప్పారు. వాటిని ఫోటో తీసి యాప్‌లో పెట్టాలని ఉన్నతాధికారులు చెప్పారని, కానీ సంబంధిత యాప్ సక్రమంగా పనిచేయడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ నాయకులు ప్రేమ, బాలాజీ, శాంతి, జ్యోతి, హైమా, సుజాత తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై ప్రసన్నుడి వైభవం


దేవేరులతో తిరుచ్చిపై స్వామివారి విహారం


పుత్తూరు రూరల్: మండలంలోని అప్పలాయగుంటలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం, ద్వాదశి సందర్భంగా విశేష సేవలు జరిగాయి. వేకువ జామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం ఉభయ నాంచారుల సమేతంగా ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను పట్టు పీతాంబరాలు, విశేష ఆభరణాలు, పరిమళభరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి ఊయలలో కొలువు దీర్చారు. భక్తి కీర్తనల ఆలాపనలు, మేళతాళాల నడుమ ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన శ్రీవారు ఉభయ దేవేరిలతో కలిసి తిరుచ్చి వాహనంపై తిరువీధుల్లో విహరించారు. మంగళ వాయిద్యాల నడుమ వాహన సేవ నయనాదందకరంగా సాగింది. భక్తులు నారికేళ, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయ అర్చకులు రమణాచార్యులు, ఆలయ అధికారి శివకుమార్ పర్యవేక్షించారు.

గరుడ విహారీ గోవిందా..

పిచ్చాటూరులో శ్రీధర్మరాజస్వామి ఆలయ తిరుణాళ్లలో భాగంగా తొమ్మిదోరోజు శనివారం శ్రీకృష్ణుడు గరుడ వాహనాన్ని అధిష్టించి పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. కళాకారుల పండరి భజనలు, మంగళవాయిద్యాలు, గోవింద భజనల నడుమ ఊరేగింపు నేత్రపర్వంగా సాగింది. పట్టణ ప్రజలు పిండివంటలు నివేదించి, కర్పూర హారతులతో స్వాగతం పలికారు. ఆదివారం అగ్నిగుండ ప్రవేశం, సోమవారం వసంతోత్సవం, ధర్మ రాజు పట్టాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయని గ్రామ సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి వివరించారు.

వానా కాలం. పాములతో భద్రం!

- ఆదమరిస్తే కాటేస్తాయ్
- ఏమరుపాటుగా ఉంటే ప్రాణాలకే ముప్పు
- వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి
- కాటేసిన వెంటనే ప్రథమ చికిత్స చేయాలి
- స్థానిక ఆస్పత్రిలో అందుబాటులో మందులు



గుడిపాల: వర్షాకాలంలో పాములు ఎక్కువగా కనిపిస్తుంటాయి. ముఖ్యంగా అటవీ ప్రాంతంలోని సరిహద్దు గ్రామాల్లో, దట్టమైన పొదల సమీపంలో సంచరిస్తుండడం సాధారణమే. అయితే ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా పాముకాటుకు గురయ్యే ప్రమాదం ఉంది. కొన్నిరోజుల కిందట చిత్తపారలో గొర్రెలను మేపుతుండగా ఓ వృద్ధుడు పాముకాటుకు గురై చనిపోయాడు. నంద్రకప్ప, తేలు కాటుకు గురై పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఏటా జూలై నుంచి సెప్టెంబర్ వరకు పాములు, ఇతర విష కీటకాల బెడద అధికంగా ఉంటుంది. పొలాల్లో కలుపులు ఏపుగా పెరగడంతో ఎక్కడ ఏ విషపురుగు ఉందో గుర్తుపట్టడం కష్టం ఉంటుంది. అయితే అన్నదాత అప్రమత్తంగా ఉండి కొన్ని జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను అధిగమించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

నిర్లక్ష్యం తగదు

ప్రస్తుతం విషపూరిత జీవులు విరివిగా పంట పొలాల్లో సంచరిస్తూ ఉంటాయి. ముఖ్యంగా పాములు ఎలుకలను, కప్పలను తినేందుకు బయట తిరుగుతూ, చెట్ల పొదల్లో దాగుంటాయి. అలాంటి సమయంలో అప్రమత్తంగా ఉండాలి. ఏదైనా ప్రమాదం సంభవించినప్పుడు నిర్లక్ష్యం వహించకూడదు. ముఖ్యంగా పాము కాటేస్తే ఒంటిపై రెండు లేదా నాలుగు కామా (,) ఆకారపు గుర్తులు పడతాయి. అరగంటలోపు విషం ఒళ్లంతా పాకి నాడీ వ్యవస్థపై ప్రభావం చూపిస్తుంది. కళ్లు మూతలు పడడం, చేతులు, కాళ్లకు తాత్కాలికంగా పక్షవాతం రావడం, మాట ఆగిపోవడం, నాలుకకు రుచి తెలియకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. రక్తపింజర కరిచిన భాగం ఉబ్బి తీవ్రంగా నొప్పి కలిగిస్తుంది. అరగంటలో నోట్లోంచి, చెవుల్లోంచి రక్తస్రావం జరుగుతుంది.

అన్ని పాములు ప్రమాదకరం కాదు

మనకు కనిపించే అన్ని పాములు విషపూరితం కాదని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. నాగుపాము, కట్లపాము, రక్తపింజర వంటి పాముల వల్లే ప్రమాదం ఉందని చెబుతున్నారు. సాధారణంగా 50శాతం పైగా పాముల వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని అంటున్నారు. పాము కాటేసిన వెంటనే వైద్యం చేయించుకుంటే ఎలాంటి సమస్య ఉండదు.



రక్తపింజర

ఎక్కువ అటవీ ప్రాంతంలో ఉంటుంది. ఈ పాము కాటువేస్తే 2 గంటల తరువాత విషం శరీరానికి ఎక్కుతుందని చెబుతున్నారు. రక్తపింజర కాటువేసిన వెంటనే అందుబాటులో ఉన్న ప్రాథమిక ఆస్పత్రులకు వెళ్లి వైద్యం పొందాలి.

నాగుపాము

నాగుపాము అత్యంత ప్రమాదకరమైంది. ఈ పాము కాటువేస్తే 15 నిమిషాల్లో విషం ఎక్కుతుందని, ముందుగా పాముకాటు వేసిన చోట వెంటనే కట్టు కట్టాలి. తదుపరి పాముకాటుకు గురైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించాలి. నాగుపాము విషం ప్రధానంగా నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

కట్లపాము

కట్లపాము కాటు వేసిన వెంటనే విషం రక్తంలో కలుస్తుంది. ప్రాణాపాయం ఎక్కువ. పాము కాటు వేసిన వెంటనే ఆస్పత్రిలో చేర్పించి వైద్యం చేయించాలి. కట్లపాము విషం రక్తంలోకి చేరకముందే వైద్యం చేయిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంది.

అప్రమత్తంగా ఉండాలి



పాము నుంచి రక్షించుకునేందుకు అప్రమత్తంగా ఉండాలి. పాముకాటుకు గురైతే యాంటీ వీనమ్ మందులు అన్ని ప్రాథమిక కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయి. కాటుకు గురైన వ్యక్తి శరీరంలో మార్పులు రాకుండా తగు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

– హరి, వైద్యాధికారి, పీహెచ్‌సీ, గుడిపాల

పాముకాటేస్తే ఇలా చేయాలి



పాముకాటుకు గురైన వారు ఎలాంటి ఆందోళన చెందకూడదు. తీవ్రమైన ఒత్తిడికి గురైతే గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంది. పాము కాటువేసిన భాగాన్ని ఎక్కువగా కదిలించరాదు. ఆ భాగాన్ని బట్టతో లేదా టవల్‌తో గట్టిగా కట్టాలి. ఇలా చేయడం వల్ల విషం శరీరంలోకి వ్యాపించదు. కట్టును పది నిమిషాలకు ఒకసారి వదిలి మళ్లీ కడుతూ ఉండాలి. పాముకాటు వేసిన చోట కొత్త బ్లేడుతో ప్లస్ (+) గుర్తు మాదిరి ఒక సెంటీమీటర్ లోపలి వరకు కోయాలి. కాసేపటికి విషంతో కూడిన రక్తం దానంతట అదే బయటకు పోతుంది. సాధ్యమైనంత తొందరగా సమీపంలోని ఆస్పత్రికి వెళ్లి, యాంటీ వీనమ్ తీసుకుంటే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు. అన్ని ప్రాథమిక ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు. రాత్రి వేళల్లో పొలం వద్దకు వెళ్లే రైతులు శబ్దం చేస్తూ టార్చ్‌లైట్ వెంట తీసుకెళ్లడం మంచిది.